



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 6 డిసెంబర్ 2025 పేజీలు 8





### రహదారి భద్రతతోనే..

# స్వర్ణాంధ్ర కల సాకారం

- గతేడాది కంటే ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గింది
- ద్విచక్ర వాహనాల వల్లే అధిక ప్రమాదాలు
- ఎన్ హెచ్ 65 లో ప్రమాదాలు, మరణాలు అధికం
- కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ
- 2026 లో రోడ్డు ప్రమాద మరణాలను బాగా తగ్గించాలి
- కొన్ని ప్రాంతాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలి
- ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే అధిక రోడ్డు ప్రమాదాలు
- మద్యం తాగి వాహనం నడిపిన కేసులలో శిక్షలు పడేలా చూడాలి
- పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** 2024తో పోలిస్తే 2025 లో ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ (డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ) సమావేశంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాటాడుతూ 2024లో రోడ్డు ప్రమాదాల సంఖ్య 1343 ఉండగా, ఈ సంవత్సరంలో 918 కి తగ్గిందని చెప్పారు. మరణాల లోనూ తగ్గుదల కనిపించిందని, 432 నుంచి 317 కి తగ్గాయని తెలిపారు. వివిధ శాఖలు సమన్వయంతో కలిసి చేపట్టిన చర్యల వల్ల ఈ పురోగతి సాధ్యమైందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. మిగతా 2లో...

### వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా

# తాటిపర్తి కొండారెడ్డి

అభినందనలు తెలిపిన పలువురు నేతలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డిని నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రకటించింది. తాటిపర్తి కొండారెడ్డి కార్పొరేటర్ గానే కాకుండా విజయవాడలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు డివిజన్ కు తీసుకొచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయితే అధికారం మారిన తర్వాత పలువురు కార్పొరేటర్లు పక్క పార్టీల వైపు చూసినా మిగతా 2లో



# రౌడీషీటర్ దారుణ హత్య

పుట్టినరోజు వేడుకల్లో స్నేహితుల మధ్య చెలరేగిన వివాదం

కత్తితో పొడిచి చంపిన మరో రౌడీ షీటర్

హత్య వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన నిందితుడు..

**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ :** మండలంలో చిల్లకల్లు గ్రామంలో ఒక దారుణ సంఘటన చోటు చేసుకుంది. పుట్టినరోజు వేడుకలో తలెత్తిన చిన్న వివాదం ఒక సస్పెక్ట్ షీటర్ హత్యకు దారితీసింది. మిగతా 2లో...

### ఎటువంటి అనుమతులు లేకుండా

# యదేచ్ఛగా మైనింగ్



- పరిమితి మించిన లోడుతో టిప్పర్లు
- శృతిమించిన వేగంతో గ్రామ రోడ్లపై టిప్పర్లు
- పూర్తిగా ధ్వంసం అవుతున్న గ్రామాలలో రోడ్లు
- రాత్రి వేళల్లో నిద్ర ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- దుమ్ము ధూళితో ఇల్లంతా నిండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**పెడన, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని జింజేరు గ్రామంలో నుండి నందమూరు మీదుగా మచిలీపట్నం కు రాత్రి వేళల్లో భారీగా బుసక మాఫియా టిప్పర్లతో బుసకను తరలిస్తున్నారని దీంతో గ్రామంలో రోడ్లు పూర్తిగా కనుమరుగవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బుసక మాఫియాకు ఎటువంటి అనుమతులు లేవని అందువల్ల రాత్రి వేళల్లో వీరు రవాణాకు 2

(మొదటిపేజీ తరువాయి)

## వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తాటిపర్తి కొండారెడ్డి



కొండారెడ్డి మాత్రం వైసీపీని వీడలేదు. దీంతో అధిష్టానం గుర్తించి కొండారెడ్డికి సంయుక్త కార్యదర్శిగా పదవి అప్ప చెప్పింది. ఈ సందర్భంగా తాడిపర్తి కొం డారెడ్డి మాట్లాడుతూ తనకు రాష్ట్ర బాధ్య తలు అప్పచెప్పిన వైఎస్ జగన్, దేవినేని అవినాష్‌కు కృతగ్నతలు తెలిపారు. తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ముచేయనని, పార్టీ మరళా అధికారం లో వచ్చేంతవరకు అహర్నిశలు పార్టీ కోసం కష్టపడతానని తెలిపారు. ఈ సందర్భంగా తాటిపర్తి కొండారెడ్డికి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్‌తో అభినందనలు తెలిపారు.

## రహదారి భద్రతతోనే స్వర్ణాంధ్ర కల సాకారం

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో మూడోవంతు ప్రమాదాలు, మరణాలు ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారిలో ఎన్ హెచ్ 65 లో 58 శాతం ప్రమాదాలు, 41 శాతం మరణాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రహదారులపై వేగ పరిమితులను (స్పీడ్ లిమిట్స్) తెలిపే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఓవర్ లోడ్ తో వెళుతున్న వాహనాలను నియంత్రించాలని, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలలో బాధితులను రక్షించిన వారిపై (గుడ్ సమారిటన్) ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయరని, పోలీసు విచారణ పేరిట ఇబ్బందులు ఉండవని చెప్పారు. అలాంటి ప్రాణదాతలను సత్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో ఎన్జీవోలు భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... భవానిపురం, ఇబ్రహీంపట్నం, పటమట, కంచికచర్ల, కృష్ణ లంక పోలీస్ స్టేషన్ల పరిధిలో అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. బస్టాండ్, బెంజ్ సర్కిల్, రామవరప్పాడు మొదలైన ప్రాంతాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు సంభవించే బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. పౌరులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడానికి కొత్త యాప్ ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. రోడ్డు ప్రమాదాలలో మృతి చెందిన వారిలో ద్విచక్ర వాహనదారులు 202 మంది ఉండగా, పాదచారులు 102 మంది ఉన్నారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులలో శిక్ష ల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపా లక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ (ట్రాఫిక్) షేక్ షెరీన్ బేగం, డి ఆర్ ఎస్ సి సభ్య కార్యదర్శి, ఆర్ & బి ఎస్ఈ జీవి భాస్కరరావు, డిపిఓ లావణ్య, డీఈవో సుబ్బారావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుమన్, పోలీస్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యదేచ్ఛగా మైనింగ్

సిద్ధమవుతున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. శీతాకాలం కావడంతో మంచుతో కూడిన దుమ్ము లెగటం వల్ల పిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత వ్యాధులకు గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి హయాంలో ఇలా టిప్పర్లు విపరీతంగా తిరిగేవని ఇప్పుడు వైసీపీ అధికారంలో లేకపోయినా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా కొంతకాలం గడిచిన తర్వాత మరల ఇలా తిరగటంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు వస్తే వీరిని ఆపే వారే లేరని చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలు లేకపోతే ఇలా రాత్రి వేళలో అక్రమ రమాణా ఎలా కుదురుతుంది అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే దీనిపై దృష్టి సారించి అధికారులకు హుకుం జారిచేయాలని కోరుతున్నారు. అక్రమ మైనింగ్ అడ్డుకట్ట లేకపోతె గ్రామాలలో టిప్పర్లు తిరగకుండా అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## రౌడీషీటర్ దారుణ హత్య....

స్నేహితుడినే అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితుడు, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, తానే ఒక 'వాంటెడ్ క్రిమినల్' అని ప్రకటించుకోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే, విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్‌గా నమోదైన పిల్ల సాయి తన స్నేహితులతో కలిసి చిల్లకల్లులో ఒక పుట్టినరోజు పార్టీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భవానీపురం పీఎస్‌లో సస్పెక్ట్ షీటర్‌గా ఉన్న అలవల నవీన్ రెడ్డి కూడా హాజరయ్యాడు. పార్టీ జరుగుతున్న సమయంలో పిల్ల సాయి, నవీన్ రెడ్డి మధ్య మాట మాట పెరిగి ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన పిల్ల సాయి, నవీన్ రెడ్డిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో నవీన్ రెడ్డి కుప్పకూలిపోగా, పిల్ల సాయి అనుచరులు అతడిని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి గేటు బయట వదిలేసి పరారయ్యారు. కొద్దిసేపటికే నవీన్ రెడ్డి మృతి చెందాడు. అనంతరం, నవీన్ రెడ్డిని పొడుస్తున్న వీడియోలను పిల్ల సాయి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. "నేనే వాంటెడ్ క్రిమినల్" అంటూ క్యాప్షన్ పెట్టి పలువురికి షేర్ చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# కనుల పండువగా శ్రీనివాస కల్యాణం





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ డిసెంబర్ 05:** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసిన శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విశేష కళ్యాణం శుక్రవారం కనుల పండువగా జరిగింది. మహాక్షేత్రం దశమ వార్షికోత్సవాల్లో భాగంగా దేవదేవుని విశేష కల్యాణాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీవీ కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధారెడ్డితో పాటు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పీ నాగిరెడ్డి, ప్రసన్న దంపతులు పీటల మీద కూర్చొని శ్రీనివాసుని కల్యాణాన్ని జరిపించారు. ఈ కళ్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి దేవదేవుడి పట్ల తమ విశ్వాసాన్ని భక్తి భావాన్ని చాటుకున్నారు. వేద పండితులు మంత్రోచ్చారణతో కళ్యాణం విశిష్టతను, దాని వల్ల కలిగే మంచిని అర్ధాలతో సహా వివరించారు. శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం నిర్వహణకు మహాక్షేత్రాన్ని, కళ్యాణ మండపాన్ని రక రకాల రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆడ పిల్లలు లేని వారు లక్ష్మి, పద్మావతి దేవిలను తమ కన్యకా రత్నాలుగా భావించి దివ్యశ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర మార్గానుసారంగా శ్రీ శ్రీనివాస కళ్యాణం నిర్వహించటం వల్ల కన్యాదానం చేసినంత పుణ్యం లభిస్తుందని వేద పండితులు వివరించారు.

**చక్రస్నానం :** శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణానికి ముందు దేవతామూర్తులకు వేదపండితులు చక్రస్నానం జరిపించారు. ఉదయం నిత్య అర్చన, తోమాల సేవ అనంతరం ఉత్సవ మూర్తులను స్నపన మండపం వద్దకు తోడ్కొని వచ్చి పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో, అభిషేకం, చూర్ణ, గంధోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేటిలో చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానం సందర్భంగా కోనేటిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. శ్రీవారి చక్రస్నానం ఆచరించిన తరువాత కోనేటిలో స్నానమాచరించినా, దర్శించినా, కోనేటి నీటిని చల్లుకున్నా వంద అశ్వమేధాల శక్తి వస్తుందని వేద పండితులు తెలిపారు. ప్రతి రోజు స్వామివారి పుష్కరిణిలో స్నానమాచరిస్తే నదీ పుష్కరాల సమయంలో పుణ్య స్నానం చేసినంత ఫలితం ఉంటుందని తెలిపారు. స్వామివారి చక్రస్నానం, కళ్యాణంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధారెడ్డి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ పీ నాగిరెడ్డి, ప్రసన్న దంపతులు, వారి కుటుంబసభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**శ్రీవారి పాదసేవకు ప్రత్యేకంగా..** భక్తులు శ్రీ వారి పాద సేవ చేసుకునేందుకు ప్రత్యేకంగా ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. మహా క్షేత్రాన్ని సందర్శించే భక్తులు దేవదేవుడికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. వారు సమర్పించిన కొబ్బరి కాయల నుంచి వచ్చే జలం శ్రీ వేంకటేశ్వరుడి పాదాలు అభిషేకించేలా ఏర్పాటు చేశారు. భక్తులు దీపారాధన చేసుకుని తమకు జ్ఞానం ప్రసాదించాలని వేసుకునేందుకు అనువుగా ఆలయ ఆగ్నేయ భాగంలో దీపారాధనకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జ్యోతి ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలుగుతూనే ఉంటుంది. అక్కడ భక్తులు దీపారాధన చేసుకోవచ్చు.

**విశేష మండపాల ప్రారంభం..** డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం అభివద్ధిలో భాగంగా ఆలయ మాడ వీధుల్లో విశేష మండపాలను ఆలయ ధర్మకర్తసుధా రెడ్డి ప్రారంభించారు. దక్షిణ రాజగోపురంలో కత యుగాన్ని తెలిపే నరసింహ స్వామితో కూడిన ప్రహ్లాద సహిత శ్రీ నరసింహస్వామి ప్రణవానందా మండపం ప్రారంభించారు. పశ్చిమ రాజగోపురం త్రేతాయుగం దైవం రామచంద్రుని కొలిచేలా శ్రీ మానసానంద మండపం, ఉత్తర భాగాన ద్వాపర యుగాన్ని సూచించే శ్రీ కష్ణ పరమాత్మతో కూడిన శ్రీకష్ణసుధా మండపం, తూర్పు భాగంలో ఆలయం ఎదురుగా ఆగ్నేయ దిశలో భక్తులకు మోక్షాన్ని ప్రసాదించే గజేంద్ర మోక్షంతో కూడిన పరమాత్ముని మండపాన్ని ప్రారంభించారు.

**ముగిసిన బ్రహ్మోత్సవాలు..** ఈ నెల రెండో తేదీ నుంచి జరుగుతున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దశమ బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఏకాంత సేవతో ముగిసాయి. నాలుగు రోజులపాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా భక్తి కోటి తరించేలా ధర్మకర్తలు నిర్వహించారు. సాయంత్రం దోపు ఉత్సవం, ధ్వజావరోహణం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణాలు, విశేష ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి.






## గ్రామీణ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 5, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం, కానుమోలు చింతా సీతయ్య జూనియర్ కాలేజీలో మెగా పేరెంట్%-%టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ కృపావతి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మెడివ్యాలి హాస్పిటల్ సహకారంతో విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌కు మెడివ్యాలి డైరెక్టర్ డాక్టర్ సుధా అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ కృపావతి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు క్రీడారంగం, వృత్తి నైపుణ్యాలు, విద్య ప్రతి రంగంలోనూ మరింత ప్రతిభ కనబరచాలని, కాలేజీ తరపున విజేతలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సుధా మాట్లాడుతూ నేటి యువతలో డ్రగ్స్, గంజాయి, సిగరెట్లు, మత్తుపదార్థాలపై అవగాహన పెరగాలని, వీటి వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని, ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదమని హెచ్చరించారు. యువత డ్రగ్స్ నుండి దూరంగా ఉండాలని సూచించారు. పేరెంట్స్ కమిటీ సభ్యురాలు బి. నీలిమా మాట్లా డుతూ ఈ తరహా సమావేశాలు తల్లిదండ్రులు-అధ్యాపకులు- విద్యార్థుల మధ్య చదువు పట్ల అవగాహన పెంచుతాయని అభిప్రాయపడ్డారు. కళాశా లలో నిర్వహించిన క్రీడా పోటీలు, వ్యాసరచనలో విజయం సాధించిన విద్యా ర్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ కృపావతి, డాక్టర్ సుధా, డాక్టర్ స్పందన, పూర్వ విద్యార్థులు కమ్మిలి సూర్యనారాయణమూర్తి, డి.6 శివ అందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిదాయక విజయగాధలు రూపొందించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వివిధ ప్రభుత్వ రాయితీలు విని యోగించుకుని విజయవం తమైన వారి స్ఫూర్తిదాయక విజయగాధలు తయారు చేసి ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై జిల్లాలోని స్ఫూర్తిదాయక విజయగాధల తయారీపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలను పొంది విజయవంతమైన వ్యక్తులు లేదా ప్రాజెక్టుల కథలు, వ్యవసాయం (పాడి పరిశ్రమ, ప్రకృతి సేద్యం), ప్రభుత్వ సేవలు వంటి విజయం సాధించిన గాథలను తయారు చేసి కృష్ణాస్ఫూర్తి పేరుతో ప్రతిరోజు వాటిని ప్రసార మా ధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని సూచిస్తూ, అవి ఇతరులకు స్ఫూర్తి నిస్తాయని ఆ దిశగా కృషి చేయాలన్నారు. వారు ఆయా రంగంలో విజయ వంతం అవ్వడానికి సహకరించిన అంశాలను వివరిస్తూ, ఇతరులు కూడా అదే స్ఫూర్తితో ఎదగవచ్చని, అందుకు ప్రభుత్వ పరంగా అందించే సహకా రాన్ని, వనరులను తెలియపరుస్తూ ఆసక్తి గలవారు సంప్రదించవలసిన సంప్ర దింపు వివరాలను ఆ కథలో పొందుపరచాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు, డ్వాక్రా మహిళల వ్యాపా రాలు, పాడి పరిశ్రమ, వ్యక్తిగత వ్యాపారాలు తదితర రంగాలలో విజయగా ధలను గుర్తించాలని సూచించారు. దీనికి గృహ నిర్మాణ సంస్థ పిడి విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, పశుసంవర్ధక, మత్స్య, ఉద్యాన శాఖల అధికారులు చిన్న నరసింహులు, అయ్యా నాగరాజా, జె జ్యోతి, డ్వామా, డిఆర్డిఏ పీడీలు ఎన్వీ శివ ప్రసాద్ యాదవ్, హరిహరనాథ్, ఏపీ ప్రకృతి వ్యవసాయ డిపిఎం పార్థసారథి, ఎల్డిఎం రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికి సులభమైన మార్గాన్ని అందిస్తున్న ఎస్‌బిఈఆర్







**విజయవాడ, మేజర్ న్యూస్ :** స్బెర్‌బ్యాంక్, రష్యా యొక్క అతి పెద్ద బ్యాంక్, జెఎస్సి ఫస్ట్ అసెట్ మేనేజ్మెంట్ కలిసి ఫస్ట్-ఇండియా అనే కొత్త మ్యూచువల్ ఫండ్‌ను ఆవిష్కరించాయి. ఈ ఫండ్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) యొక్క ప్రధాన సూచిక నిఫ్టీ 50 ఇండెక్స్ (ఎన్ఎస్ఈ ఐ) పనితీరును అనుసరించే పెట్టుబడి అవకాశాలను అందిస్తుంది. ఈ ప్రారంభాన్ని మిస్టర్ హెర్మన్ గ్రెఫ్, స్బెర్‌బ్యాంక్ సిఇఒ, ఎగ్జిక్యూటివ్ బోర్డు ఛైర్మన్, తన భారత పర్యటన సందర్భంగా ఎన్ఎస్ఈలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు అత్యంతగా అనుసరించే ఈక్విటీ సూచికలలో నిఫ్టీ 50 ఒకటి. భారత ఆర్థికవ్యవస్థలోని 15 కీలక రంగాలను ప్రతినిధ్యం చేస్తూ, ఎన్ఎస్ఈలో జాబితా చేయబడిన 50 లార్జ్-క్యాప్, అధిక లిక్విడిటీ గల కంపెనీలు ఈ సూచికలో ఉంటాయి. భారతదేశంలోనే నిఫ్టీ 50ని అనుసరించే 45కిపైగా పాసివ్ ఫండ్లు ఉండగా, అంతర్జాతీయంగా మరొక 22 పాసివ్ ఫండ్లు ఈ సూచికను ట్రాక్ చేస్తాయి. 1996లో ప్రారంభమైన నిఫ్టీ 50, వచ్చే 2026 ఏప్రిల్ 22న తన 30వ వార్షికోత్సవాన్ని జరుపుకోబోతోంది.

**ఆశిష్ కుమార్ చౌహాన్, ఎండి & సీఈవో, ఎన్ఎస్ఈ :**

"నిఫ్టీ 50కు అనుసంధానించిన పెట్టుబడి పరిష్కారాలను ప్రారంభిస్తున్న స్బెర్ బ్యాంక్‌కు మేము మద్దతు అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇవి రష్యన్ పెట్టుబడిదారులకు భారత ఈక్విటీ వృద్ధికి సరళమైన, నమ్మదగిన ప్రాప్తిని అందిస్తూ, రెండు దేశాల మధ్య మూలధన ప్రవాహాలను బలోపేతం చేస్తాయి. ఈ కార్యక్రమం భారత మార్కెట్లపై ఉన్న బలమైన నమ్మకాన్ని ప్రతిబింబించడమే కాకుండా, భారత-రష్యా ఆర్థిక సహకారాన్ని మరింత బలపరుస్తోంది. లిక్విడిటీ, పారదర్శకతను పెంపొందించడంలో, మార్కెట్ కనెక్టివిటీని మెరుగుపరచడంలో, రెగ్యులేటరీ, పెట్టుబడిదారుల రక్షణ ప్రమాణాలకు మద్దతు ఇవ్వడంలో, రెండు దేశాల పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను తెరవడంలో స్బెర్‌బ్యాంక్‌తో కలిసి పని చేయడంలో ఎన్ఎస్ఈ కట్టుబడి ఉంది."

**హెర్మన్ గ్రెఫ్, సీఈవో, ఎగ్జిక్యూటివ్ బోర్డు ఛైర్మన్, స్బెర్‌బ్యాంక్:**

"మేము మా రష్యన్ ఖాతాదారులకు ఇప్పుడు దక్షిణ ఆసియాలో కొత్త పెట్టుబడి అవకాశాలను అందిస్తున్నాము. మా కొత్త ప్రోడక్ట్, ప్రపంచ ప్రాధాన్య ఆర్థిక మార్కెట్లలో ఒకటైన భారతీయ స్టాక్ మార్కెట్‌కు సులభంగా పెట్టుబడి పెట్టే అవకాశం అందిస్తుంది. ఇప్పటి వరకు, భారతీయ ఆస్తుల్లో నేరుగా పెట్టుబడి చేయాలనుకున్న రష్యన్ పెట్టుబడిదారులకు సూటి మార్గాలు చాలా పరిమితంగా ఉండేవి. ఇప్పుడు, ఈ ప్రోడక్ట్ ద్వారా రెండు దేశాల మధ్య కొత్త, సమర్థవంతమైన ఆర్థిక వంతెనను మేము నిర్మించాము," అని ఆయన అన్నారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుతో,గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లనేని వంశీ మోహన్ ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ పాతపాడు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలపాల అబ్రహం మాట్లాడుతూ..గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రామంలోనీ ప్రజల స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూటమి ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతను ప్రజలు సంతకాలు రూపంలో చూపిస్తున్నారు అని తెలిపారు. పిపిపి విధానాన్ని విరమించుకొని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను నిర్వహించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి విద్యార్థుల



జీవితాలతో చెలగాటం ఆడకూడదని,రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు మంద శివరాజ్, సీనియర్ నాయకులు,పి.ఓంకార్ రెడ్డి,కలపాల అబ్రహం,ఈద కోటి రెడ్డి,కొమరవెల్లి అనిల్,ధారావతు కృష్ణ నాయక్, పి.సాంబయ్య,ఏ.శంకర్, వైయస్సార్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# పంట బీమా వారోత్సవానికి ఎస్ బిఐ జనరల్ ఇన్సూరెన్స్ మద్దతు ఇస్తుంది

SBI general INSURANCE
SURAKSHA AUR BHAROSA DONO

**విజయవాడ, డిసెంబర్ 05, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ సాధారణ బీమా సంస్థలలో ఒకటైన ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) కింద రాబోయే పంట బీమా వారోత్సవంలో చురుకుగా పాల్గొనడానికి భారత ప్రభుత్వ వ్యవసాయ %ద% రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుక, పంట బీమా యొక్క ప్రాముఖ్యతపై రైతుల అవగాహనను మరింతగా పెంచడం, వారి వ్యవసాయ జీవనోపాధిని భద్రపరచడానికి పిఎంఎఫ్‌బివై పథకాన్ని బాగా నావిగేట్ చేయడంలో వారికి సహాయపడటం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చొరవలో భాగంగా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అస్సాం, తమిళనాడు రాష్ట్రాలలో కేటాయించిన జిల్లాల్లో కంపెనీ వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తుంది. కవరేజ్ వివరాలు, నమోదు నిబంధనలు, క్లెయిమ్‌ల విధానాలతో సహా రైతుల అవగాహనను పెంచడానికి, పంట బీమా పథకం యొక్క లక్షణాల గురించి వారికి అవగాహన కల్పించడానికి విస్తృతమైన కార్యకలాపాల జాబితాను ప్రణాళిక చేయబడింది. ఇందులో ఫసల్ బీమా పాఠశాలలు, రైతు వర్క్‌షాప్‌లు, కిసాన్ మేళాలు, మహిళా రైతులను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక నమోదు-ఆధారిత పరస్పర చర్యలు వంటి వివిధ విస్తృతమైన ఆన్-గ్రౌండ్ కార్యక్రమాల కార్యకలాపాలు ఉన్నాయి. రైతులలో అవగాహనను మరింత పెంచడానికి, ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ఇంటింటికీ ప్రచారాలు, పాఠశాలలు, కళాశాలలలో విద్యా కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు, బోట్ అవుట్రీచ్, వీధి నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా స్థానికంగా నిశ్చితార్థం నిర్వహిస్తుంది. గ్రామం, బ్లాక్, జిల్లా స్థాయిలో ప్రచారాన్ని విస్తరించడానికి కరపత్రాలు, తరచుగా అడిగే ప్రశ్నలు పంపిణీ, హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లను ఉపయోగించి విస్తృత బహిరంగ ప్రకటనలు కూడా నిర్వహించబడతాయి. ఈ గ్రౌండ్ కార్యకలాపాలకు అనుబంధంగా, ప్రాంతీయ భాషలలో బలమైన డిజిటల్, సోషల్ మీడియా ప్రచారం ఈ చొరవ ప్రభావాన్ని మరింత పెంచుతుంది. ఈ చొరవపై మాట్లాడుతూ, ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో, భారతదేశ వ్యవసాయ సంఘం యొక్క స్థితిస్థాపకత, పురోగతిని బలోపేతం చేయడమే మా లక్ష్యం అని ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో, మా లక్ష్యం ఎల్లప్పుడూ ఉంది. రైతులు మన దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక,, వారికి మద్దతు ఇవ్వడం మేము ఎంతో విలువైనది. రైతులతో మరింత సన్నిహితంగా పాల్గొనడానికి, పథకం గురించి వారి అవగాహనను సరళీకరించడానికి, వారికి అందుబాటులో ఉన్న రక్షణ గురించి వారికి బాగా తెలియజేయడానికి పంట బీమా వారం మాకు అర్థవంతమైన వేదికను అందిస్తుంది. ప్రభుత్వ సంస్థలు, సంస్థాగత భాగస్వాములతో కలిసి పనిచేయడం ద్వారా, నమోదు ప్రక్రియ సజావుగా ఉండేలా, భూమిపై అమలు సకాలంలో, ప్రభావవంతంగా ఉండేలా చూసుకోవడం మా లక్ష్యం. ప్రతి సంవత్సరం, మేము జాతీయ స్థాయి కార్యక్రమాలలో పాల్గొంటాము, ఇవి విశ్వాసాన్ని పెంపొందించడం, ఆర్థిక రక్షణను విస్తృతం చేయడం, గ్రామీణ భారతదేశం అంతటా స్థిరమైన, సమగ్ర వృద్ధికి దోహదపడటంలో మా నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.




## ఈ నెల 8 నుంచి ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఉత్తమ సర్వీస్, యాజమాన్య అనుభవాన్ని అందించాలని ఇసుజు నిబద్ధతను పునరుద్ఘాటించాలనే నిరంతర ప్రయత్నములో, ఇసుజు మోటార్స్ ఇండియా తన ఇసుజు డి-మ్యాక్స్ పిక్-అప్స్, ఎస్‌యూవిల కోసం దేశవ్యాప్త 'ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్'ను నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో సమస్యా రహితమైన డ్రైవింగ్ అనుభవం కోసం వినియోగదారులకు ప్రస్తుత ప్రయోజనాలు, నివారణాత్మక నిర్వహణ పరీక్షలు అందించడం ఈ సర్వీస్ క్యాంప్ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ వింటర్ క్యాంప్ అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్స్‌లో డిసెంబర్ 8 నుండి డిసెంబర్ 13 వరకు నిర్వహించబడుతుంది. ఈ సమయంలో ఉచిత 37-పాయింట్ సమగ్ర చెక్-అప్, లేబర్ పై 10 శాతం, విడిభాగాలపై 5 శాతం, ల్యూబ్స్, ఫ్లూయిడ్స్ పై 5 శాతం, రీటెయిల్ ఆర్?ఎస్?ఏపై 20 శాతం, ప్రోకేర్ పై 5 శాతం, ఈడబ్ల్యూపై 10 శాతం రాయితీ, ఉచిత రీజెన్ సదుపాయం లభిస్తుంది.

## రంగయ్యప్పారావుపేట రేషన్ డీలర్ రత్న శేఖర్ ఆకస్మిక మరణం

### రేషన్ డీలర్ల సంఘం శ్రద్ధాంజలి



**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 5, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం, రంగయ్యప్పారావుపేట - గ్రామ రేషన్ డీలర్ రత్న శేఖర్ (53) గుండె నొప్పితో అనారోగ్యానికి లోనై హాస్పటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. దాదాపు 25 ఏళ్లుగా గ్రామ ప్రజలకు అంకితభావంతో సేవలందించిన రత్న శేఖర్ మరణం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. ఆయన కుటుంబంలో భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల గ్రామస్తులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వేపల్లి శేఖర్, కమిటీ సభ్యులు, డీలర్లు రత్న శేఖర్ కు నివాళులు అర్పిస్తూ, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

## జాతీయ సదస్సులో వి.వి. ఫార్మసీ విద్యార్థినుల ప్రతిభ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** విజయవాడలోని కేవీఎస్సార్ సిద్ధార్థ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో డిసెంబర్ 3, 4 తేదీల్లో డీబీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో వి.వి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, గుడ్లవల్లేరు బి.ఫార్మసీ విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడం కళాశాలకు గర్వకారణంగా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో నాలుగవ సంవత్సరం బి. ఫార్మసీ విద్యార్థినులు ఇ-పోస్టర్ ప్రదర్శన విభాగంలో ఎన్. కావ్య వర్షిత మొదటి బహుమతి సాధించగా, మౌఖికప్రదర్శన చేసిన పి.చిన్నారి ద్వితీయ బహుమతి, డి. సంకీర్తన తృతీయ బహుమతి సాధించగా, ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణ రావు విద్యార్థినులను అభినందిస్తూ, ఈ విజయాలు సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల అధ్యాపకులు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాల మేరకు వాహనాల తొలగింపు



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** రామవరప్పాడు గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద డివైడర్ మధ్యలో ఉంచిన వాహనాలను ప్రభుత్వ విప్ గన్నవరం నియోజవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు పోలీసులు తొలగించారు. వివిధ సందర్భాల్లో పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను ఆంజనేయస్వామి గుడి వద్ద డివైడర్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఉంచారు. నెలల తరబడి అక్కడే ఉండడంతో అవి దుమ్ము కొట్టుకుపోయి అధ్వాన స్థితికి చేరాయి. వారం రోజుల క్రితం ఈ రహదారిలో వెళుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు డివైడర్ మధ్యలో ఉన్న వాహనాలను గమనించి తరచూ విఐపిలు వీఐపీలు ప్రయాణించే మార్గంలో అధ్వాన్నంగా ఉన్న వాహనాలను వెంటనే తొలగించాలని పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డివైడర్ మధ్యలో ఉన్న వాహనాలను పడమట పోలీస్ లు వేరే ప్రాంతానికి తరలించారు.

## రామచంద్రపురంలో మెగా పేరెంట్స్ మీటింగ్



ఏ.కొండూరు,మేజర్ న్యూస్: మండలంలోని రామచంద్ర పురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం 3.0 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి రోజా రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు మెగా పేటీఎం 3.0 కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో నిర్వహిస్తున్నారని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. 6 వ తరగతి నుండి 10 వ తరగతి వంకు ఎ ఎస్ ఎ ఐ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు పత్రాలను అందించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పనిచేసే సానిటరీ సిబ్బందికి, మధ్యాహ్న భోజన కార్మికులకు గడ్డి కృష్ణారెడ్డి దంపతులు శాలువా పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి రాజేశ్వరి, పి చెన్నారావు, ప్రధానోపాధ్యాయులు షేక్ సుల్తానా, ఉపాధ్యాయులు ఎం బసవయ్య, తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

## నిమ్మకూరు గురుకుల పాఠశాలలో మెగా పిటిఎం



పామర్రు మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిమ్మకూరులోని గురుకుల కళాశాలలో శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ వేడుకలను మండల పరిషత్ అధ్యక్షులు దాసరి అశోక్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యాప్తికి అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు అలాగే విద్యార్థులు కూడా ప్రభుత్వం ఇస్తున్న పథకాలను సద్వినియోగపరచుకొని విద్యావంతులుగా ఎదగాలని సూచించారు ఈ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంత ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకుమారి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నందమూరి ప్రసాద్, పామర్రు ట్రైనీ ఎస్ఐ ఎల్.సత్యకళ, గ్రామానికి చెందిన రిటైర్డ్ మేజర్ వై.వి.కృష్ణారావు, కళాశాల విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు, పలువురు గ్రామస్తులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బొట్టు నాగయ్య ప్రభుత్వ కళాశాలలో...




పెడన, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ విద్య శాఖ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లాలో ఘనంగా నిర్వహించిన తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం 3.0 పెడన బొడ్డునాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది అని ప్రిన్సిపాల్ కె. సి ఎస్ వి రామారావు తెలిపారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి యస్ సరళ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఇష్టపడి చదివి విజేతలు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వారు అందిస్తున్న పలువిద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ బోర్డు వారు చేపట్టిన యాభై రోజుల సంకల్ప కార్యక్రమం విజయవంతం చేయాలని తద్వారా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కె సి యస్వీ రామారావు మాట్లాడుతూ కళాశాల ప్రగతిని వివరించారు. సభలో ఆత్మీయ అతిథిగా మాజీ కౌన్సిలర్ కట్టా హేమసుందర మూర్తి మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు ఆధ్వర్యంలో కళాశాల అభివృద్ధి పథంలో నడుస్తుందని, చక్కని రిజల్ట్, అడ్మి షన్లు కూడా పెరిగాయని కొనియాడారు. మరో ఆత్మీయ అతిథిగా కృష్ణా జిల్లా అకడమిక్ గైడెన్స్, మోనిటరింగ్ సెల్ ఇంఛార్జి పేరిశెట్టి నాగరవి మా ట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వ్రాత పుస్తకాలు, సైన్స్ విద్యార్థులకు రికార్డు,ప్రయోగదీపికలు, ఇంజినీరింగ్, నీట్ పరీక్షలకు కాంపిటీషన్ మెటీరియల్స్ క్రీడాకారులకు స్పోర్ట్స్ పరికరాలు ప్రభుత్వం వారు అందించారని విద్యార్థుల సంపూర్ణ వికాసానికి తోడ్పాటు అందిస్తుందని ప్రతి ఒక్కరూ వీటిని సక్రమంగా ఉపయోగించుకుని మంచి ఉత్తీర్ణత శాతం తో విద్యార్థులు పాస్ కావాలని ఆకాంక్షను తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సైదా, శ్రీనుబాబు, కట్టా వెంకట నాగేశ్వరరావు,రూపనాగ,శ్రీ,వెంకన్న, నిరంజనరావు, గంగాధర్,గిరి, విజయ్,రాజ్యలక్ష్మి,మధు..అనిత, రాజ్యలక్ష్మి,దుర్గ, కార్యాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థపై బాధ్యతగా ఉన్న కూటమి ప్రభుత్వం



పమిడిముక్కల మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశానికి తల్లిదండ్రుల హాజరు శాతం తక్కువగా ఉండటం పట్ల స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన పమిడిముక్కల, అలాగే మండలంలోని తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరిగిన సమావేశాలకు ఎమ్మెల్యే కుమార్ రాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా పాఠశాలలలో ఉన్న విద్యార్థులకు తల్లిదండ్రుల నిష్పత్తి చూస్తే కేవలం 10 శాతం మాత్రమే ఉండటం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మధ్య సమన్వయం లేదనే విషయాన్ని ఈ సంఘటన బహిర్గతం చేస్తోందన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సత్సంబంధాలు నెలకొల్పుకుని విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో ప్రతి సమావేశానికి తల్లిదండ్రులు నూరు శాతం హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు పిల్లల పట్ల ప్రేమానురాగాలు ఆప్యాయతతో వ్యవహరిస్తూ వారిని ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, ఎంపీటీసీ సభ్యులు జి. వంశీ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు భవాని, ఉప విద్యాశాఖ అధికారిణి ఐ.పద్మరాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మేరీ, తహశీల్దార్ సిహెచ్. నవీన్ కుమార్, ఎంపీడీవో వీర్ల సీతారామరాజు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, దాత మైనేని నాగేశ్వరరావు లతోపాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు గ్రామ సర్పంచి జంపాన ధనలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ఎస్.ఎన్.ప్రసాద్, దాత గుర్రాల రాధాకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు లతో పాటు పలువురు దాతలు, తల్లిదండ్రులు విద్యా కుటుంబం సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా విద్యార్థినీవిద్యార్థులు ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శన, వైజ్ఞానిక ప్రదర్శనలను ఎమ్మెల్యే తిలకించి విద్యార్థులను అభినందించారు.

## ఆర్ఎంపి వైద్య కేంద్రాలపై డిఎంహెచ్‌వో ఆకస్మిక దాడులు.



పామర్రు మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పామర్రు లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్ ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇటీవల పామర్రు లో ఆర్ఎంపీ వైద్యులు తమ వైద్య కేంద్రాలలో పడకలను ఏర్పాటు చేసి చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో జరిగిన ఈ దాడులు చర్చనీయాంశమయ్యాయి. శుక్రవారం ఆయన తమ సిబ్బందితో కలిసి వివిధ ఆర్ఎంపి వైద్య కేంద్రాలపై దాడులు నిర్వహించగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆరు వైద్య కేంద్రాలను సీజ్ చేశారు. ఆయా కేంద్రాలలో నిబంధనలకు విరుద్ధంగా సెలైన్ సీసాలు, ఇంజక్షన్లు, ఇతర మందులు లభించడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పామర్రు లోని శివ, రోహిణి, లక్ష్మి, వెంకటేశ్వర స్వామి, ఇందిర, ప్రజా వైద్యశాల పేర్లతో ఉన్న వైద్య కేంద్రాలపై దాడులు చేసి వాటిని సీజ్ చేశారు. వాటి నిర్వాహకులకు మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని షో కాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇటువంటి వైద్య కేంద్రాలను తక్షణ మూసి వేయడంతో పాటు వారిపై చర్యలు కూడా తీసుకుంటామని ఈ సందర్భంగా డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. ఈ దాడులలో కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జీషన్ ఖాన్, ప్రోగ్రామ్స్ అధికారి ఆనంద్, సూపర్ వైజర్ వైవిజయ సారథి, సిహెచ్ఓ స్టీవెన్, దీప్తి, సింధు, ఎంపిహెచ్ఏ టి.వి.జి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాలోని ఆర్ఎంపి లకు నేడు అవగాహన సదస్సు**

పామర్రులో ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్ చేసిన సందర్భంలో జిల్లాలో గల ఆర్ఎంపీ వైద్యులందరికీ 6వ తేదీ శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్ తెలిపారు. మచిలీపట్నంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలో గల ఆర్ఎంపి వైద్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్ఎంపి వైద్యులు చేయవలసిన పనులు, చేయకూడని పనులు పై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.



## కోసూరులో ఉచిత కంటి చికిత్స శిబిరం

మొవ్వ మేజర్ న్యూస్: మండలం పరిధిలోని కోసూరు విజయశ్రీసన్.ఫ్లవర్ పాఠశాలలో ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వర్ల కుమార్ రాజా శుక్రవారం ప్రారంభించారు. శంకరనేత్రాలయ ఎం.ఈ. ఎస్.యు-పుట్టపర్తి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిర సంయుక్త కంటిపొర చికిత్సా శిబిరాన్నిడాక్టర్ కృష్ణమోహన్ ఎండి రాజ్యలక్ష్మి దంపతులు, వేములమడ లక్ష్మీ పెరుమాళ్ళట్రస్టు వ్యవస్థాపకులు వేములమడ శ్రీనివాస సురేష్ బాబు కుటుంబ సభ్యుల సహకారంతో వారం రోజులు పాటు నిర్వహిస్తున్నారు.5వ తేది నుంచి 8వతేది వరకు నాలుగు రోజులపాటు పరీక్షలు నిర్వహించి, తొమ్మిదో 9వ నుంచి ఆపరేషన్లు చేయ ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్. రామలింగేశ్వర రావు,సన్నవర్ విద్యాసంస్థల చైర్మన్ ఎండివిఎస్ పున్నం రాజు పాల్గొన్నారు.

# పిల్లల విద్యలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం......



జగ్గయ్యపేట: డిసెంబర్ మేజర్ న్యూస్ : మండలంలోని, చిల్లకల్లు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, 20 పాయింట్స్ చైర్మన్ దినకర్, ఆర్డీవో బాలకృష్ణ మండల విద్యాశాఖ అధికారి ఎల్. చిట్టిబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పేరెంట్స్, విద్యార్థులను ఉద్దేశించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన ఈ మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ మన విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఎంతో ముఖ్యమైన వేదిక. పిల్లల విద్యను ఒక పాఠశాల, ఒక టీచర్ మాత్రమే కాకుండా తల్లిదండ్రులు, టీచర్లు, సమాజం కలిసి తీర్చిదిద్దాలి. ఈ భావంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వం అంతటా విద్యా సంస్కరణలను ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తున్నారని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయించిన్నారి తిరిగి పాఠశాలకు రావాలి, మంచి విద్య పొందాలి అనే లక్ష్యంతోనే. పిల్లల కోసం మెరుగైన క్లాస్‌రూమ్స్, డిజిటల్ లెర్నింగ్, స్టూడెంట్ మానిటరింగ్, టీచర్ ట్రైనింగ్‌ఇవి అన్నీ ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోంది అని అన్నారు. చిల్లకల్లు పాఠశాల అభివృద్ధికి ఇంకా ఏం అవసరమో ఈరోజు మీలో ప్రతి ఒక్కరి నుండి వినడానికి నేను ఇక్కడ ఉన్నాను. మీ సూచనలు అమలు చేయడంలో ఎలాంటి రాజీ ఉండదు. కూటమి ప్రభుత్వం 'విద్యలో నాణ్యత %-% విద్యార్థికి భవిష్యత్తు' అనే దృక్పథంతో ముందుకు సాగుతోందని అన్నారు.పిల్లల విద్యలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. టీచర్లతో నిరంతర సంబంధం కొనసాగించడం, వారి అభ్యాసాన్ని గమనించడం, ప్రోత్సహించడం – ఇవి పిల్లవాడి జీవన ప్రయాణాన్ని మార్చగలవు. ఈ రోజు మీ అందరి హాజరు దీనికి నిదర్శనం.జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను ఉత్తమ విద్యా కేంద్రంగా తయారు చేయడం నా బాధ్యత. ప్రభుత్వం అందించే ప్రతి పథకం, ప్రతి సదుపాయం మీ పిల్లల భవిష్యత్తుకు అంకితం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు, మన్నే శ్రీనివాసరావు, రావూరి విశ్వనాథం, తాళ్లూరి వెంకటేశ్వర్లు, కారుపాటి డేవిడ్, మల్లెబోయిన జ్వాల, దోగుపర్తి నాగభూషణం, నాయిని రజిని, పసుమర్తి మహేష్, ఆలూరి రమణ, స్కూల్ హెచ్ఎం రమణ, విద్యా కమిటీ చైర్మన్ పల్లపు సీత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర వికాసమే కూటమి ప్రభుత్వ లక్ష్యం





**కొండపల్లి మేజర్ న్యూస్ :** విద్యార్థిని, విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాలికోన్నత పాఠశాలలలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పిల్లల ప్రగతి నివేదికలపై ముఖాముఖీగా చర్చించారు. విద్యార్థినుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. పరీక్షలలో సాధించిన మార్కులు, పురోగతిని పరిశీలించారు. విద్యాభివృద్ధి, శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేథో సామర్థ్యాల నమోదు పరిశీలించారు. ఎగ్జిబిషన్లు, తరగతి గదులను సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో కల్సి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సర్కారు పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. విద్యార్థులలో లోపాలను సరిదిద్ది అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చి దిద్దడానికి ఈ సమావేశాలు ఉపకరిస్తాయన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగవుతాయన్నారు. విద్యా విషయాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ పెరిగి విద్యార్థి వికాసానికి దోహదపడుతుందన్నారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థను మరింత ఉన్నతంగా తీర్చిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి మించి సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. విద్యార్థినులకు వరాల జల్లు, హైస్కూలు అభివృద్ధికి చర్యలు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పాఠశాలలోని విద్యార్థినులకు వరాల జల్లు కురిపించారు. ఆట వస్తువులు, క్రీడా సామాగ్రి కొనుగోలులు తన స్వంత నిధుల నుంచి రూ.2లక్షలకు పైగా వెచ్చించనున్నట్లు ప్రకటించారు. మైలవరంకు చెందిన హారిక అనే క్రికెట్ క్రీడాకారిణికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని తక్షణమే అందజేశారు. అలాగే ఈ పాఠశాలలో చదివే అన్ని తరగతుల విద్యార్థినులకు మొదట స్థానాలలో నిలిచి ప్రతిభ చూపిన వారికి రూ.1 లక్ష ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని ప్రకటించిన. పాఠశాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులను, నాయకురాళ్లను భాగస్వామ్యం చేస్తూ కమిటీని నియమించారు.

మండల పరిషత్తు నుంచి రూ.7.5 లక్షలు, కొండపల్లి మున్సిపాలిటీ నుంచి రూ.7.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఏ.పి.హెచ్.ఎం.ఈ.ఎల్ నుంచి రూ.8 లక్షలు సి.ఎస్.ఆర్ నిధులు కేటాయిస్తానని వెల్లడించారు. ఈ మొత్తం నిధులతో హైస్కూలులో వంట గది, డైనింగ్ హాల్, పెయింటింగ్, టాయిలెట్స్ ఆధునికీకరణ, పలు ప్రధాన సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. పాఠశాల వద్ద బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనితో విద్యార్థినుల తల్లిదండ్రులు, పిల్లలు హర్షధ్వానాలతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థుల బంగారు భవిష్యత్తు...



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కానూరు గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్ లలో,, వి కానూరు గ్రామంలోని హై స్కూల్ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (పేటీఎం) 3.0 కార్యక్రమంలో పాల్గొన్న గోపు సత్యనారాయణ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం, పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు-తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మచిలీపట్నం మండలం, కానూరు గ్రామంలోని హై స్కూల్, వి కానూరు గ్రామంలోని హై స్కూల్ లో నిర్వహించిన "మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (పేటీఎం) బడి వైపు ఒక అడుగు" కార్యక్రమంలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే, పాఠశాల, ఇంటి వద్ద పర్యవేక్షణ అత్యవసరం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, క్రమశిక్షణపై రోజువారీ శ్రద్ధ చూపాలని. ఉపాధ్యాయులు బోధనలో మరింత నాణ్యతను పెంచలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సవ వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొనడం ఎంతో సంతోషకరం," అని అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పాఠశాల వైపు ఒక అడుగు వేయాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం విద్యార్థుల విజయానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. సమావేశం ముగిసిన అనంతరం అయన పాఠశాల ఆవరణలోనే విద్యార్థులతో కలిసి కూర్చుని, ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం మిడ్-డే మీల్స్ రుచిని, నాణ్యతను పరిశీలిస్తూ వారితో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి ఏడుకొండలు, పీత రాము, ఈవన ఏసు, చీటికీనేటి అయ్యప్ప, బోలిశెట్టి నాని, గోపు వెంకటరమణ,కొక్కిలగడ్డ ప్రభుదాస్, వీర చిన్న, ఈవన సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాధికారులు,ఉపాధ్యాయులుతల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆకుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లక్ష విరాళం




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గూడూరు మండలం ఆకుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ,15 డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ లక్ష రూపాయలు విరాళంతో నిర్మించిన తరగతి గదులను శుక్రవారం లంకిశెట్టి దంపతులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ డే సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఆకుమర్రు లో జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, తన పూర్వీకులు పుట్టిన ఆకుమర్రు గ్రామంలో తల్లిదండ్రుల పేరు మీద లక్ష రూపాయలు విరాళం ఇవ్వడం జరిగిందని గ్రామ అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఇటీవల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజనల్ బ్యాంకింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో 5,00,000 నిధులను పాఠశాల అభివృద్ధి కోసం అందించడం జరిగిందని బాలాజీ తెలియజేశారు. గ్రామాలలో విద్యార్థులు చదువుకుని ఎదగాలని గ్రామాలే భారతదేశానికి పట్టుకొమ్మలని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం విద్యార్థుల కోసం విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు కేటాయిస్తుందని తెలియజేశారు ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయాలతో ఎదగాలని అన్నారు కృష్ణాజిల్లాలో కు గ్రామం నుండి ఐఏఎస్ అయిన ముత్యం రాజు నేటి యువతరానికి ఆదర్శప్రాయం అన్నారు. 15వ డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుని ఎదగాలని సెల్ ఫోన్ కు టీవీలకు దూరంగా ఉండాలని అన్నారు.నైతిక విలువలతో కూడిన విద్యలు విద్యార్థికి ఎంతగానో దోహదపడతాయని, క్రమశిక్షణ తప్పకుండా ఉండాలని అన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ గోపి నాగబాబు మాట్లాడుతూ ఆకుమర్రు గ్రామ అభివృద్ధిలో గతంలో పలు సహాయాలు అందించిన లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ నేడు లక్ష రూపాయలు తో గదులు నిర్మించడం వలన ఉన్నత పాఠశాలగా స్కూలును అప్ గ్రేడు చేసుకునే అవకాశం కలిగిందని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో స్కూల్ అభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలియజేశారు. పాఠశాల అధ్యాపకులు ప్రధానోపాధ్యాయులు టీచర్లు పాఠశాలలో రంగురంగుల ముగ్గులతో పండగ శోభను తలపిస్తూ చక్కటి అలంకరణ చేసి తల్లిదండ్రులతో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## చీమలపాడులో మెగా పేరెంట్స్ డే



**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** మరపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిదులు గా పాల్గొన్న ఏ ఏ ఎం టి కె దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదర్ బాబా, ఎస్సై జి మహాలక్ష్మణుడు, పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీమలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు బెజవాడ శంకర్, జడ్పీటీసీ భూక్యా గన్య, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొండపాటి సుబ్బారావు, స్కూల్ చైర్మన్ నాగుల్ మీరా, మరీదు జమలయ్య, మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతి రావు, మండల మైనారిటీ నాయకులు షేక్ఆదం షరీఫ్, బూత్ కన్వీనర్ సింహాద్రి సత్యం, చీమలపాడు కోశాధికారి బెజవాడ ఆదిశేషు, స్కూల్ హెచ్ఎం హైమేశ్వరావు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు మొదలగు వారు పాల్గొన్నారు.

## మెగా పిటీఎం ద్వారా సత్ఫలితాలు : ఎస్.ఐ శిరీష



**మొవ్వ మేజర్ న్యూస్ :** మెగా పి టి ఏం3.0 ద్వారా విద్యార్థులు సత్ఫలితాలు సాధించేందుకు ఎంతో దొంహదపడతాయని కూచిపూడి ఎస్.ఐ పి.శిరీష అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మొవ్వ పి.ఎం. ఎస్ఎంకె జడ్పీ పాఠశాలలో శుక్రవారం మెగాపిటిఎం-3.0 ఆనందోత్సాహాల నడుమ కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుపై, పాఠశాల అభివృద్ధి కోసం సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందపరిచా యి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ ఉమాశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి. పూర్ణచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మండవ నీలవేణి, గ్రామ ప్రముఖులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ వాసుదేవరావు, మండవ( బుజ్జి )కోటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ బాబురావు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో దొండపాటి



**మైలవరం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మైలవరం మండలం కీర్తిరాయునిగూడెం గ్రామంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0 పాల్గొన్న ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొస్తుందని తల్లిదండ్రులు మీ పిల్లలపై శ్రద్ధ చూపించాలని స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత స్కూల్లో ఉపాధ్యాయులు హోం వర్క్ ఏం ఇచ్చారని, పిల్లలు యొక్క ప్రవర్తన ఎలా ఉందో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిని బాధ్యత ఉందని తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, చదువుతోపాటు ఆటపాటలలో కూడా ముందుండాలని తెలియజేశారు. విద్యా వ్యవస్థలో మార్పులకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభనాద్రి, గ్రామ పార్టీ అధ్యక్షుడు చనుమోలు శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు

## నిడుమోలులో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం.

**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నిడుమోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి యుగంధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దళితవాడలో పరిసరాల పరిశుభ్రత, దోమల ద్వారా వ్యాపించే వైరల్ ఫీవర్స్ గురించి దళితవాడవాసులకు పలు సూచనలు ఇస్తూ మురికి గుంటలలో దోమల నిర్మూలనకు మందు చల్లాలని. అలాగే తాజాగా ప్రబలుతున్న స్క్రబ్ టైఫస్ వ్యాధులపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో కెవిఎస్ శంకర్రావు, ఏఎన్ఎం బివినాగమణి, ఆశా వర్కర్ ఎం సలోమి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మైలవరం, మేజర్ న్యూస్ : చాట్ల విజయలక్ష్మి జన్మదినం సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వెనుక స్వర పాలిక్ క్లినిక్‌లో స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మైలవరం, రెడ్డిగూడెం, జి కొండూరు, ఏ కొండూరు మండలాలకు చెందిన రోగులు ఈ శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు పొందారు. ఆర్తో 85, స్కిన్ 60, గైనిక్ 30, చిన్న పిల్లలకు సంబంధించి 15, జంగల్10 మంది, మొత్తం 200 మందికి పైగానే రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ సిహెచ్ రత్నకాంత్, డాక్టర్ బి రోషిని, డాక్టర్ వి.వెంకట్, డాక్టర్ డి గౌతమి, డాక్టర్ ఎస్ వి కృష్ణచైతన్య, డాక్టర్ ప్రతాప్ లు, వైద్య సేవలు అందించారు.

## పశుపోషకులు లింగ నిర్ధారిత వీర్య నాళికను వినియోగించండి : డాక్టర్ శ్రీనివాస్



పెదపారుపూడి మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా గోకుల మిషన్ పథకం కింద సబ్సిడీపై అందిస్తున్న లింగ నిర్ధారిత వీర్య నాళికను రైతులు సద్వినియోగపరచుకోవాలని పశువర్ధక శాఖ గుడివాడ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన యలమర్రు ప్రాంతీయ పశు ఆసుపత్రి పరిధిలోని జనార్ధనపురం, భూషణగుళ్ళ, వానపాముల గ్రామాలలోని ఉప కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయా గ్రామాల్లో లింగ నిర్ధారణ వీర్య నాళికలు ద్వారా పుట్టిన వెయ్యదోడలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పశుపోషకులకు పలు సూచనలను అందించారు. ప్రభుత్వం సబ్సిడీపై లింగ నిర్ధారిత వీర్య నాళికలను 150 రూపాయలకే అందిస్తోందని ఆయన తెలిపారు. గ్రామాల్లోని పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఈ వీర్య నాళికను వినియోగించుకోవడం ద్వారా ఎక్కువగా పెయ్యదూడలను గ్రామాలలో పుట్టించి పశుసంతతి అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యలమర్రు పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ జి.వి.నరసింహారావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



మైలవరం, మేజర్ న్యూస్ : గొల్లపూడి నారాయణ ఒలంపియాడ్ స్కూల్లో చిన్నారులతో నారాయణ ప్రైమర్ లీగ్ ఆటల పోటీలు ( ఎన్ పి ఎల్) ప్రిన్సిపాల్ మాధవి లత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులతో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాధవి లత మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఆటల పోటీలు శరీర ఎదుగుదలకు మానసిక ఉల్లాసానికి ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డి సింహాద్రి, క్లస్టర్ ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, ముఖ్య అతిథులుగా హై స్కూల్ కోఆర్డినేటర్ శశిధర్, డీన్ జగదీశ్వరి, ఏవో వాసంతి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఏవో వాసంతి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముఖ్య అవసరాలకు సాయం



ఘంటసాల, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముఖ్య అవసరాల నిమిత్తం రూ. 50 వేలు క్రీ. శే. మండల శివరామకృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాంబశివరావు ఇచ్చిన విరాళాన్ని మండవ వెంకటరత్నమ్మ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ కు అందించారు. ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజలకు విశేష సేవలందిస్తున్న, ఘంటసాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ముఖ్య అవసరాలకు ఈ రూ 50 వేలు విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. రోగులకు అవగాహన కల్పించడానికి, కొత్త టెలివిజన్ కొనుగోలు, స్వచ్ఛమైన తాగునీరు, ఆర్ఓ వాటర్ ప్లాంట్ అభివృద్ధి కి, విద్యుత్ నిరంతర సరఫరాకు ఇన్వెర్టర్లు ఉపయోగించాలన్నారు. వేమూరి వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణులు ఐక్యతతో ఉంటూ హక్కులు సాధించుకోవాలి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పడి నేటికీ పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మచిలీపట్నం నగరం పరాసుపేటలోగల త్రిపుర సుందరి ఫౌండేషన్‌లో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా అందించే పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐక్యతతో ముందుకు వెళుతూ హక్కులు సాధించుకోవాలి అన్నారు. రాష్ట్రంలోని నిరుపేద బ్రాహ్మణుల కోసం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్రాహ్మణులందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఒకరి కోసం అందరం, అందరి కోసం మనందరం అన్న భావనతో ముందుకు వస్తే మన సమాజం శక్తివంతం అవుతుంది అన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి మాట్లాడుతూ.బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లో సభ్యత్వం 18 సంవత్సరాలు నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ కంపల్సరిగా బ్రాహ్మణులు అందరూ సభ్యత్వం తీసుకుని, బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా అందించే వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యనారాయణ శర్మ కోరారు.సమాజంలో బ్రాహ్మణులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చంద్రబాబు పెట్టి అండగా నిలవడం శుభపరిణామం అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడలో మాత్రమే ఉందని, జిల్లా విభజన జరిగింది కాబట్టి మచిలీపట్నంలో బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయించి, సొసైటీ ద్వారా అందించే పథకాలను నిరుపేద బ్రాహ్మణులకు అందించే విధంగా కృషి చేయాలని సభాముఖంగా కార్పొరేషన్ డైరెక్టర్ పి. వి ఫణి కుమార్ ను సూర్యనారాయణ శర్మ కోరారు.బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ.మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, కలపటపు బుచ్చి రాంప్రసాద్ ల దృష్టికి బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ విషయాన్ని తీసుకువెళ్లి మచిలీపట్నంలో బ్రాంచి ఏర్పాటు చేయించే విధంగా కృషి చేస్తానని పి. వి. ఫణి కుమార్ సభా ముఖంగా తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు వస్తున్నా మీకోసం పాదయాత్రలో రాష్ట్రంలో బ్రాహ్మణుల కష్టాలను గుర్తించి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తొలిసారిగా మన రాష్ట్రంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చంద్రబాబు ఎంతోమంది నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలబడుతున్నారు అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్రాహ్మణ కార్పొరేషన్ కు అండగా నిలబడే ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ కు, మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర తదితర మంత్రులకు, రాష్ట్రంలోని కూటమి శాసనసభ్యులకు, ఎమ్మెల్సీలకు పార్లమెంటు సభ్యులకు, ప్రభుత్వ నాయకులకు, సపోర్టర్లకు, సమాజ సేవకులకు, అధికారులకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ సభాముఖంగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపి వీరందరి సహాయ సహకారాలతో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మరింత బలోపేతం అయి, నిరుపేద బ్రాహ్మణులకు మరిన్ని పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని సభాముఖంగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి.ఫణి కుమార్ పలువురు బ్రాహ్మణులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ నుండి వచ్చిన మేనేజర్, గోర్తి శ్రీనివాస్ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా అందించే, అరుంధతి సూక్ష్మ రుణ పథకం, వశిష్ట సూక్ష్మ రుణ పథకం, అర్చకమిత్ర పథకం, పురోహిత మిత్ర పథకం తదితర పథకాలపై సభాముఖంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, మచిలీపట్నం బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు, జొన్నవిత్తుల మల్లికార్జున ప్రసాద్, మోపర్తి సుబ్రహ్మణ్యం, వి ఎస్ ఎస్ ఆర్ శర్మ, కే.రాధాకృష్ణమూర్తి, ఆర్ వి ఎస్ మురళీధర్, వాడపల్లి బాలాజీ సువర్ణ కుమార్, లొల్ల కుటుంబ శాస్త్రి, నిమ్మగడ్డ శ్రీధర్, వేమూరి సాయి, తంగిరాల మిథున వ్యాస్, నరసింహారావు, నందూరి సదాశివరావు, వడ్డమన్నాటి మారుతీ దివాకర్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్, చోడవరపు లక్ష్మీప్రసన్న, టీటీడీ ధర్మ ప్రచారకులు, జొన్నలగడ్డ మాధవి, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం



ఘంటసాల, మేజర్ న్యూస్ : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, కే.వి.కే, ప్రయాణం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. కె.వి.కె సమన్వయకర్త డా. డి. సుధారాణి మాట్లాడుతూ అధిక ఎరువులు వాడటే నేల కలుషితం, ఎరువుల పై ఖర్చు పెరగడంతోపాటు వ్యవసాయం ప్రశ్నార్ధకమే అన్నారు. భూసార పరిక్ష ఆధారిత ఎరువులు వాడకంతో ఖర్చు తగ్గించవచ్చున్నారు. అభ్యుదయ రైతు పరుచూరి సుభాష్ చంద్ర బోస్ చేతుల మీదుగా మట్టి పరిక్షా పత్రాలు అందజేశారు. కే.వి.కె శాస్త్రవేత్త డా.యం వెంకటలక్ష్మి (సస్య పోషణ) విభాగం మాట్లాడుతూ మన నేలలను మనం సంరక్షించుకోవాలి నేలలో రసాయనక ఎరువులతో పాటు పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువులు కోళ్ళ ఎరువులు వేయటం వలన భూమి సారవంతం పెరుగుతుందన్నారు. 3 సం" కు మట్టి పరిక్షలు చేయిస్తే నేలలో పోషక సామర్థ్యం, నేలలో పోషక లోపాలు ఉంటే సవరించు కోవచ్చున్నారు. ముందుగా భూమి ఆరోగ్యం మీద రంగోలి నిర్వహించారు. సస్య రక్షణ శాస్త్రవేత్త. డా. కె. రేవతి, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణవేణి రైతులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ : ఆరోగ్యమే మహాభాగ్యం సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి ఉన్నతంగా జీవించాలి అనే ఉన్నత ఆశయంతో విలువలతో కూడిన వైద్య సేవలు అందించుచున్న జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 455 మందికి వైద్య సేవలు అందించడం జరిగిందని జయప్రద పౌండేషన్ వారు తెలిపారు. వారిలో కంటి వైద్య సేవలు పొందిన వారు 212 మంది జనరల్ వైద్య సేవలు పొందినవారు 243 మంది, కంటి వైద్య సేవలు పొందిన వారిలో కంటిలోపములో ఉండి కళ్ళజోడుల అవసరమైన వారు 126 మంది వున్నారని తెలిపారు. వారికి జయప్రద ఫౌండేషన్ వారిచే త్వరలో కళ్ళజోడులు అందజేయడం జరుగుతుందని తెలియజేసారు. చూపు మందగించి కంటిలో శుక్లములు ఉన్న 31 మందికి, పొరలు ఉన్న 14 మంది మొత్తం 45 మందికి శంకర్ నేత్ర చికిత్సాలయం విజయవాడ వారివద్ద ఆపరేషన్ లు చేయబడునని తెలిపారు. షుగరు,బిపి,రక్త, పరీక్షలు 235 మందికి, హిమోగ్లోబిన్ (హెచ్ బి)పరీక్షలు 237 మందికి జరిపి అవసరమైన వారందరకు ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని తెలిపారు.




కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెరుకూరి జనార్ధన్ రావు, చెరుకూరి వెంకటరమణ, చెరుకూరి బ్రహ్మయ్య, ఏలూరు వెంకటరమణ, లగడపాటి శంకర్, లగడపాటి మోహనరావు, చెరుకూరి నాగేంద్రబాబు, ఏలూరు శేషు, వివిధ హోదాలో ఉన్న గ్రామ నాయకులు, యమ్ యల్ హెచ్ పి, గ్రామ వీఏవోలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఫౌండేషన్ వాలంటీర్లు ఈ కార్యక్రమానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరికి జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ధన్యవాదములు తెలిపారు.

# 22ఏ భూముల దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా సమర్పించాలి



**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**అవనిగడ్డలో భూముల క్రమబద్ధీకరణ దస్తావేజులు, పట్టాల పంపిణీ**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** 22ఏ భూముల వారు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా సమర్పించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. శుక్రవారం స్థానిక రెవిన్యూ సమావేశ మందిరంలో జీఓ నెంబర్-30 ద్వారా ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రిజిస్ట్రేషన్ దస్తావేజులు, పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విచ్చేసి నివాసితులకు క్రమబద్ధీకరణ పట్టాలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు పంపిణీ చేశార్శు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 22ఏ భూముల సమస్యల పరిష్కారం కోసం కాగితాలు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ముందుగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే తాము వాటిని క్రమపద్ధతిలో పరిష్కారం చేస్తామని ప్రకటించారు. నలభై ఏళ్ళుగా నివసిస్తున్నా ఇంటి స్థలంపై ఎటువంటి హక్కు లేని పేదలను గుర్తించి, నలభై మందికి హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ దస్తావేజులు, పట్టాలు అందించి వారికి హక్కులు కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ సమస్యను ప్రతినిత్యం తన దృష్టికి తీసుకువస్తూ వేగవంతమైన పరిష్కారం అందించడంలో కీలక పాత్ర వహించారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పేదలు తాము నివసించే భూమి తమ ఆధీనంలో ఉన్నప్పటికీ గత కొన్నేళ్లుగా ఎలాంటి హక్కులు లేక ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి సమస్యలు గుర్తించి వారి భూములు క్రమబద్ధీకరించి హక్కులు కల్పించడంలో కీలక పాత్ర వహించిన జిల్లా కలెక్టర్ బాలాజీ సేవలు ప్రశంసనీయం అన్నారు. కలెక్టర్ బాలాజీ చేపట్టిన ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములైన తహసీల్దార్ నాగమల్లేశ్వరరావును, రెవెన్యూ కార్యాలయ సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. 22ఏ భూముల దరఖాస్తులు జిల్లా కలెక్టర్ సూచన మేరకు ఆన్లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. అనంతరం పేదలకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతితో కూడిన బదిలీపై వెళుతున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు దంపతులను కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీఓ మరియాదేవి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం నుంచి ఒకరు వ్యాపారవేత్తగా ఎదిగేలా ప్రభుత్వ సహకారం





**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలనీ, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా చేయూత అందిస్తుందని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గంలో పర్యటించిన కలెక్టర్ స్వయం సహాయక సంఘాల మహిళలు డిఆర్డిఎ- వెలుగు ద్వారా ఆర్థికసహాయం పొంది ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల డ్వాక్రా యూనిట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చల్లపల్లి అగ్రహారంలో శ్రీలలితాదేవి ఎస్హెచ్జీ సభ్యురాలు ఆకుల నళిని ఏర్పాటుచేసుకున్న దుర్గాబోటిక్ లేడీస్ టైలరింగ్ యూనిట్ దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్వాహకురాలు నళిని, ఆమెభర్త దుర్గాప్రసాద్లతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. తమకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 1.82 లక్షల రూపాయలు, ముద్ర రుణాల కింద రూ.రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం రుణం మంజూరు చేసిందన్నారు. ఖర్చులన్నీ పోను నెలకు రూ. 50వేల ఆదాయం లభిస్తోందని నిర్వాహకురాలు కలెక్టర్కు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ హరిహరనాథ్, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఆనందకుమారి, ఏపీఎం కె.శ్రీనివాస్, ఈవో పి.వి.మాధవేంద్రరావు తదితరులు ఉన్నారు.

# ఎర్రచందనం అక్రమ నిల్వలు రవాణా వ్యాపారంపై సమిష్టిగా విచారణ జరిపిన అధికారులు





**వత్సవాయి :డిసెంబర్ 5 మేజర్ న్యూస్ :** మండల కేంద్రం వత్సవాయి గ్రామంలో శ్రీ తిరుపతమ్మ తల్లి (శ్రీను )హోటల్ యజమాని వెదుళ్ళ శ్రీనివాసరావు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎర్రచందనం అక్రమ నిల్వలు రవాణా వ్యాపారం వినియోగంపై ప్రభుత్వం అనుమతులు లేకుండా హోటల్ నిర్వహణ, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించపోవటం ఆర్ అండ్ బి రహదారిని ఆక్రమించటం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం వంటి తదితర అంశాలపై మండలానికి చెందిన వై బాబూరావు పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపిన స్థానిక ఫారెస్ట్ అధికారులు ఎర్రచందనం ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిడి హోటల్ యజమాని ఇచ్చిన మామూళ్ల మత్తులో తప్పుడుగా రికార్డులను తారుమారు చేసి మారుజాతి కర్రగా చిత్రీకరించి దానిపై ఫైన్ వేసి నా ఫిర్యాదును నీరుగారిచే విధంగా వ్యవహరించారని బాబూరావు తెలిపారు. అలాగే మిగిలిన అధికారులు కూడా తూతూ మంత్రం గా విచారణ జరిపించి నాకు తెలియకుండానే ఆ ఫిర్యాదును పరిష్కరించినట్లుగా క్లోజ్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆయన అధికారుల తీరుపై అసంతృప్తితో మళ్లీ పి జి ఆర్ కంప్లైంట్ ను రీ ఓపెన్ చేయడంతో డిసెంబర్ 3న ఫారెస్ట్ ఆర్ అండ్ బి పంచాయత్ రాజ్ మండల పరిషత్ రెవెన్యూ పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులు సమిష్టిగా విచారణ జరుపుతామని నాకు మండల తాసిల్దార్ సమాచారం పంపడంతో విచారణలో భాగంగా డిసెంబర్ 3 బుధవారం నేను కూడా అధికారులతో పాటు విచారణలో పాల్గొన్నాను. ఈ తరణంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ శీను హోటల్ పరిసరాలను అధికారుల సమక్షంలో విచారణ చేపట్టడం జరిగింది. విచారణ సమయంలో హోటల్ సమీపంలో ఉన్న ఎర్రచందనం దుంగలను ముందస్తు సమాచారం అందటంతో ఆ యజమాని అక్కడ ఉన్న ఎర్రచందనం కర్రను కోల్డ్ స్టోరేజ్ దగ్గర ఉన్న నిర్మానుష ప్రాంతానికి తరలించి అదే స్థలంలో మారుజాతి కర్రను నిల్వ చేయడం జరిగిందని విచారణలో తేలింది. దీనిపై ఫారెస్ట్ అధికారి అక్కడ ఉన్న ఎర్రచందనం మూలాలను( బెరడు చిన్న చిన్న కట్టెపుల్లలు) క్షుణ్ణంగా పరిశీలించి భూ పరీక్షల నిర్వహించి విచారణ చేపట్టి శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఫారెస్ట్ అధికారి తెలిపినట్లుగా బాబూరావు మీడియాతో తెలిపారు. సమగ్ర విచారణ రిపోర్టును నేడు నాకు సమాచారం పంపడం జరుగుతుందని తెలిపారు. అలాగే హోటల్ నిర్వాహకు ఎటువంటి ప్రభుత్వం అనుమతులు లేనట్లుగా ఆహార భద్రతా ప్రమాణాలు కూడా పాటించటం లేదని ఫుడ్ సేఫ్టీ అధికారులు నివేదికను పంపించడం జరిగిందని విచారణలో తేలింది, మండల సర్వే రిపోర్ట్ ప్రకారం హోటల్ ఆర్ అండ్ బి రహదారిని ఆక్రమించి నిర్మించడం జరిగిందని తేలింది. ఈ విధంగా సమిష్టి విచారణలో శ్రీ తిరుపతమ్మ తల్లి (శ్రీను) హోటల్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదని అని బాబూరావు తెలిపారు. దీనిపై విచారణ అనంతరం ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే...

## అమ్మవారి చల్లని దీవెనలు కూటమిపై ఉండాలి



పెడన, మేజర్ న్యూస్ : గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి చల్లని దీవెనలు కూటమి ప్రభుత్వంపై ఎల్లప్పుడూ ఉండాలని బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు ఈ మేరకు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని చిరా సారే సమర్పించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలుచు వారి కొంగుబంగారమై గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారు పట్టణమంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారి చల్లని దీవెనలు కూటమి ప్రభుత్వంపై ఉండాలని కోరామన్నారు.

## చదువు సంస్కారానికి నిలువెత్తు నిదర్శనం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎంపీపీ ఎస్ దేవరకోట ఏ ఏ పాఠశాలలో పిటిఎం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తూ తల్లి దండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహణ విద్యపై ప్రభుత్వానికి ఉన్న దృష్టి కొలమానం అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని, ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, ప్రతి పేదవాడు ప్రతిభావంతుడు కావాలని ఆయన ఆకాంక్షించారు. చదువే మనిషి యొక్క సంస్కారం నేర్పుతోందని, ప్రతి విద్యార్థి తమ గమ్యాన్ని చేరుకునేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. సాంస్కృతి కార్యక్రమంలో విద్యార్థినిలు చేసిన నృత్య రూపకం చూపరులను మంత్రముగ్ధులను చేసింది. లైవ్ ఇంటరాక్షన్, పేరెంట్స్ తో విద్యార్థుల యొక్క ప్రగతి పైన పేరెంట్స్తో సమావేశం నిర్వహించారు.విద్య కమిటీ చైర్మన్ పాగోలు పావని, దేవరకోట ఏ ఏ హెచ్ ఎం పి. శివరాణి, ఐ సాయి జ్యోతి, గ్రామ ప్రముఖులు బి శివ శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్నేహ, మహిళా పోలీస్ ఏఎన్ఎం, అంగనవాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణమాచార్యులు మృతికి సంతాపం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ప్రముఖ వైఖానస ఆగమపండితులు పదవీ విరమణ చేసిన ఆంధ్రోప న్యాసకులు బృందావనం రామ కృష్ణమాచార్యులు మృతికి దివితాలూకా శ్రీ వైఖానస సంఘం శుక్రవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఈయన గుంటూరు జిల్లాలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయంగా పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దటంలో ప్రధాన భూమిక వహించి పలువురు ప్రశంసలు పొందారు. ఆగమ పండితులుగా పెద్దసంఖ్యలో వైఖానస ఆగమ విద్యార్థులను తయారు చేశారు. ఆయన మృతికి సంఘ సభ్యులు డివికె సత్యప్రసాద్ బి వేణుగోపాలాచార్యులు డివి రఘు బాలకృష్ణమాచార్యులు వాసు సంతాపం వ్యక్తం చేశారు.

## మెగా పేరెంట్ - టీచర్ సమావేశంలో ఎమ్మెల్యే తాతయ్య



**వత్సవాయి, మేజర్ న్యూస్:** మండలంలో కన్నెవీడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ సమావేశంలో ప్రధాన అతిథిగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని, విద్యార్థుల అభివృద్ధి – పాఠశాల పురోగతి పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య అనేది ప్రతి కుటుంబం భవిష్యత్తుకు పునాది. ప్రభుత్వం విద్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, ప్రతి పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. విద్యార్థులు నాణ్యమైన విద్యను నేర్చుకోవడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యవృద్ధి కార్యక్రమాలు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు అందించడమే మా లక్ష్యం. పాఠశాల– తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కలిసి పనిచేసినప్పుడు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశవంతమవుతుంది. కన్నెవీడు పాఠశాలని మరింత ఆదర్శ విద్యా సంస్థగా తీర్చిదిద్దడానికి నేను వ్యక్తిగతంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, మండల విద్యాశాఖాధికారి నాగరాజు,కర్నాటి రఘు గ్రామ పార్టీ అధ్యక్షులు, కర్నాటి వెంకటరావు మాజీ సర్పంచ్,కర్నాటి శంకరరావు సొసైటీ అధ్యక్షులు,ఆదిమళ్ల రమేష్ బాబు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి,ప్రధానోపాధ్యాయులు అజ్మీర కొండ విద్యా కమిటీ చైర్మన్ కొల్లూరి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ అభివృద్ధికి దాతల ముందుకు రావడం హర్షణీయం

### ఎమ్మెల్యే కుమార్ రాజా

### రూ.50 లక్షల విరాళం అందించిన సూరపనేని సోదరులు



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** దాతలు తమ దాతృత్వంతో ముందుకు వచ్చి దేవాలయ అభివృద్ధికి సహకరించడం ఎంతో అభినందనీయమని పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు తోట్లవల్లూరు మండల పరిధిలోని పెనమకూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానం శిధిలావస్థకు చేరడంతో దాని పునః నిర్మాణానికి దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేసేందుకు ముందుకు వచ్చింది. సుమారు కోటి రూపాయల వ్యయం కాగలదని అంచనాలు రూపొందించిన తరుణంలో గ్రామస్తుల వాటాగా 33శాతం నిధులు సమకూర్చాలని ఆ శాఖ కోరడంతో దాతలు ముందుకు వచ్చి ఆ నిధులను సమకూర్చారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలు సూరపనేని సుబ్రహ్మణ్యం, సూరపనేని వెంకటేశ్వర రావు, సూరపనేని హర్ష 35 లక్షల రూపాయలను డిడి రూపంలో ఎమ్మెల్యే కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా దాతలను అభినందించారు. అంతేకాక ఈ దాతలు మరో 15 లక్షల రూపాయలను దేవాలయ పునఃనిర్మాణ పనులకు వినియోగించాలని అందజేశారు. మొత్తం 50 లక్షల రూపాయల విరాళాలను అందించిన దాతలను ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే కుమార్ రాజా చేతుల మీదుగా సత్కరించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే సూచనల మేరకు బాబు రాజేంద్ర ప్రసాద్, గోపాలకృష్ణ లు లక్ష రూపాయలు వంతున విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమం లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరామ ప్రసాద్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం వై జె ఆర్ డి ఎం ఎస్, ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ మేళా




**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని వై జె ఆర్ డి ఎం ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణాజిల్లా ఎస్టీ విద్యాసాగర్ నాయుడు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు కళాశాల ప్రెసిడెంట్ పివి రావు. ప్రిన్సిపాల్ టి రవికుమార్ జాబ్ మేళా కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయభాస్కర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు ఉపాధి అవకాశాలు పొందే విధంగా విద్యార్థులు తమ నైపుణ్యతను పెంపొందించుకోవాలన్నారు. ఎంసెట్ కు లక్షలాది మంది విద్యార్థులు హాజరవుతుండగా వారిలో ఉద్యోగ అవకాశాలు పొందుతున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు లేదా ఇతర గ్రాడ్యుయేట్స్ ఉద్యోగ అవకాశాలు తగిన సమయంలో పొందలేకపోతున్నారన్నారు. అందుకు వివిధ కారణాలు ఉన్నాయన్నారు. వాటిని అధిగమించేందుకు ఇలాంటి జాబ్ మేళాలు ఇందుకోసం ఇచ్చే తర్ఫీదులు దోహదపడతాయన్నారు. ఉద్యోగాలకు ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు ఎదురయ్యే ప్రశ్నలకు దీటైనా సమాధానం చెప్పడం కోసం ఇలాంటి జాబ్ మేళాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు.



### 3 వ రోజుకు చేరుకున్న శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు

**పెడన,మేజర్ న్యూస్:** గ్రామదేవత శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నేటితో మూడవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు పురవీధులలో ఊరేగింపుగా బయలుదేరి మంగళ హారతులు అందుకుని డప్పు వాయిద్యాలు మేళ తాళాలతో శుక్రవారం ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ ప్రకారం కాపుల వీధి నుండి ఆనవాయితీగా వస్తున్న 11 సిడిబండ్లను అంగరంగ వైభవంగా పట్టణ పురవీధుల్లో ఉరేగతు వివిధ రకాల వేషాధారణలతో, కోలాటాలతో బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకుంటారు. తెల్లవారుజామునుండే భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఆ సౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసామని ఆలయ కార్యనిర్వాహన అధికారి గోవాడ వెంకటకృష్ణారావు తెలిపారు.

# లోకేష్ చొరవతో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు



**గన్నవరం, డిసెంబర్ 5, మేజర్ న్యూస్ :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణల వల్ల విద్యారంగం అభివృద్ధి పదంలో దూసుకుపోతుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మెగా పేటీఎం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం మండల పరిధిలోని గొల్లనపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన పీఎం లేబరేటరీని, క్రీడా మైదానంలో నూతనంగా నిర్మించిన ఆరు కోర్టులను యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మంత్రి లోకేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ ఏడాది జులై నెలలో తొలిసారిగా నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్కు రాష్ట్రవ్యాప్తంగా 2.28 కోట్ల మంది హాజరై రికార్డ్ సృష్టించిన సంగతి గుర్తు చేసారు. కేవలం ప్రైవేటు పాఠశాలల్లో ఉండే పేరెంట్ టీచర్ మీటింగ్ ను ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు వివరించేందుకు వీలు కలుగుతుం దన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు ఎరిగి విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. చదువుకునే వయసులో ఇతర వ్యాపకాలపై దృష్టి పెట్టి చదువుని నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం కష్టపడాల్సి ఉంటుందని విద్యార్థులను హెచ్చరించారు. విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలని తద్వారా పోటీ పరీక్షల్లో పాల్గొనటం సులభతరంగా ఉంటుందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో అదనపు తరగతి గదుల నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణం, ఆర్వో ప్లాంట్ ల ఏర్పాటు, పాఠశాలల రిపేర్లు కోసం రూ. 11.02 కోట్లు నిధులు మంజూరు చేసిన మంత్రి లోకేష్ కు ఈ సందర్భంగా యార్లగడ్డ ధన్యవాదాలు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పథకం ద్వారా గన్నవరం నియోజకవర్గంలోని 15,092 మంది విద్యార్థులకు రూ 3.77 కోట్లు, తల్లికి వందనం ద్వారా 46,907 మంది విద్యార్థులకు రూ. 70.36 కోట్లు ఇచ్చినట్లు యార్లగడ్డ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ ఎం సి మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, గ్రామ సర్పంచ్ గణపవరపు శాంతి, ఎంపీటీసీ మొరం నాగరాణి, మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, నాయకులు చిరుమామిళ్ల సూర్యం, బోయపాటి బుల్లయ్య, చిట్టీనేని జోజి, యనమదల సతీష్, బోడపాటి రవి, మేడేపల్లి రమ, దాసరి విజయ రావు, అంకెం రామారావు, కొలుసు రాంబాబు, గోగం బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లి సత్య జగదీశ్వరరావు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## జె.యన్.టి.యు అంతర్ కళాశాలల పోటీల్లో యస్.ఆర్.జి.ఈ.సి. విద్యార్థుల ప్రతిభ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల చెందిన పురుషుల, మహిళల టీములు జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ, కాకినాడ వారు వెలగపూడి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో కళాశాల చెందిన మహిళల టీము ద్వితీయ స్థానం, పురుషుల టీము తృతీయ స్థానం సాధించారు. అదేవిధంగా యూనివర్సిటీ వారు నిర్వహించిన యూనివర్సిటీ టీములో పి.హర్షిత లక్ష్మి మూడవ సంవత్సరపు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విద్యార్థిని ఎన్నికై ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు గీతం యూనివర్సిటీ, విశాఖపట్నం లో నిర్వహించు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారు. డి. గంగాధర్ నాలుగవ సంవత్సరపు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థి ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు అమిత్ యూనివర్సిటీ చెన్నై లో జరుగు దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డా.బుర్రా కరుణ కుమార్ తెలియజేశారు. ఈ బహుమతులు పొందిన విద్యార్థినీ విద్యార్థులను, వ్యాయామ అధ్యాపకులు మత్తి శివ శం కర్, డి.పూజిత, ఎస్.నాగబాబు లను కళాశాల ఛైర్మన్ డా.నాగేశ్వర రావు వల్లూరుపల్లి, సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో సెక్రటరీ , కరస్పాండెంట్ రామకృష్ణ వల్లూరుపల్లి, కళాశాల ప్రిన్సిపాల్ డా.బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ డా.పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారులు డా.పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డా.పి.కోదండ రామారావు, డా.ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది వీరిని అభినదించారు.

## 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు సొమ్ము జమ



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 24 నుండి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమయ్యేలా కూటమి సర్కారు చర్యలు తీసుకుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని రాయనపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవను అమలు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన గోతాలు సిద్ధం చేశారని అన్నారు. తేమ శాతం నిర్ధారించే యంత్రాలు, రవాణా సదుపాయాల విషయంలో ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి “7337359375” వాట్సాప్ నంబర్‌కు “హాయ్” అనే సందేశం పంపి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కూడా కల్పించారని పేర్కొన్నారు. సరైన నాణ్యతా ప్రమాణాలను అనుసరించి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి, మద్దతు ధరలు పొందాలని రైతులకు సూచించారు. రైతులకు మద్దతు ధరలు దక్కేలా కొనుగోళ్లు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999